క్లుప్తంగా

నేడు సంబురాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణ మాఫీ సంబురాల కార్యక్రమాన్ని నేడు(గురువారం) నిర్వహించనున్నట్లు ఏడీఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్షలోపు రుణాలు మాఫీ కార్యక్రమం మొదలవుతుందన్నారు. రైతు వేదిక ద్వారా రైతుల ఖాతాల్లో నేరుగా జమ కావడం , ఇతర విషయాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల రైతులు, అభ్యుదయ రైతులు, పీఏసీఎస్ అధ్యక్షులు, సీఈఓ, బ్యాంక్ ప్రతినిధులు సంబురాల్లో పాల్గొంటారని తెలిపారు.

సంబురాలు జరుపుకోవాలి

ములుగు: రైతుల పంట రుణాలను మాఫీ చేస్తున్న సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో నేడు (గురువారం) ప్రతీ మండల కేంద్రంలో సంబురాలు జరుపుకో వాలని కిసాన్ కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మంత్రి సీతక్క, పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్ ఆదేశాల మేరకు ప్రతీ మండలంలో ఈ సంబురాలు జరుపాలన్నారు.

పోలీసుల బందోబస్తు

ఏటూరునాగారం: మొహర్రం, తొలి ఏకదశి పండుగలు ఒకే రోజు రావడంతో బుధవారం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై తాజొద్దీన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ప్రజలు గ్రామ పురవీధుల్లో పీరీలను ఊరేగించారు. అలాగే ఆలయాలల్లోకి భక్తులు తరలి వెళ్లారు. దీంతో పహారా నిర్వహించి పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సూచనలు చేశారు.

పీఆర్సీ ప్రకటించాలి

ములుగు: పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిరుప సతీష్ కుమార్, ఏళ్ల మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా ఒక్క డీఏ కూడా ప్రకటించక పోవడం విచారకరమన్నారు. అదే విధగా రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి నాన్ జాయినింగ్ పోస్టులకు వెంటనే ప్రత్యక్ష పద్ధతిలో ప్రమోషన్ ప్రక్రియ చేపట్టాలని కోరారు. పే రివిజన్ కమిషన్ నుంచి వెంటనే నివేదికలను తెప్పించుకొని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల వారితో చర్చించి పీఆర్సీ ప్రకటించి జూలై 2023 నుంచి ఆర్థిక లాభం చేకూరేలా ప్రభుత్వం చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పూర్తికాని బ్రిడ్జి పనులు

ఏటూరునాగారం: కొండాయి వద్ద కూలిపోయిన బ్రిడ్జిపై చేస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకా పూర్తి కాలేదని, వెల్డింగ్ చేసే క్రమంలో కొంత ఆలస్యం జరుగుతుందని ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించి ప్రకటనను విడుదల చేశారు. వరదలు ఎక్కువగా ఉండడం వల్ల బ్రిడ్జి పనులు ఆటంకం జరుగుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రయత్నాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్, ఆర్ అండ్‌బీశాఖ ద్వారా ఈ పనులను పూర్తి స్థాయిలో పర్యవేక్షించి పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తి కాకపోతే కొండ్రేడు నుంచి కొండాయి ప్రజల రాకపోకలను సాగే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

బురదలో కూరుకుపోయిన ట్రాక్టర్



కాటారం: తొలిఏకాదశిని పురస్కరించుకొని గోదావరి స్నానం కోసం భక్తులతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ బురదలో కూరుకుపోయింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని దామెరకుంటకు చెందిన పలువురు భక్తులు పుణ్యస్నానం కోసం ట్రాక్టర్‌లో సమీపంలోని గోదావరికి బయల్దేరారు. మట్టి రోడ్డు గుండా వెళ్తుండగా మార్గ మధ్యలో ట్రాక్టర్ ట్రాలీ ఒక్కసారిగా బురదలో దిగబడి ఒక వైపుగా పడిపోయింది. ట్రాక్టర్‌లో సుమారు 20 మంది ప్రయాణిస్తుండగా ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. రహదారిపై ఉన్న గుంతలు వరద నీటితో నిండిపోవడంతో డ్రైవర్ గమనించక ప్రమాదం చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

స్తంభం ఎక్కిన పాము!

కాళేశ్వరం: అసలే వర్షాకాలం.. రాత్రి, పగలు విషకీటకాలు సంచరిస్తాయి. కానీ ఏకంగా విద్యుత్ స్తంభంపై కాళేశ్వరం పరిధిలోని పూసుకుపల్లి గ్రామం వద్ద ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు బుధవారం కనిపించడంతో వారు షాక్‌కు గురయ్యారు. పాము స్తంభంపై పాకి విద్యుత్ తీగలు ఉన్న ఇన్సులేటర్‌కు చుట్టుకోవడంతో రెండు ఇళ్లకు షాట్ సర్క్యూట్‌తో విద్యుత్ సరఫరా నిలిచింది. కాగా, ఆ పాము అక్కడిక్కక్కడే మృతి చెందింది. ఇలా స్తంభంపైకి పాకి ఉంటే మరమ్మతులు చేసే ఉద్యోగులకు ప్రమాదం పొంచి ఉందని పలువురు వాపోతున్నారు.

వరి నాట్లు ప్రారంభం



పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



నాటు వేస్తున్న మహిళలు

వెంకటాపురం(కె): మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. జూన్ నెలలో వర్షాలు తక్కువగా కురవటంతో వరి నార్లు పోసి దుక్కులు దున్నుకోని రైతులు వర్షం కోసం ఎదురు చూశారు. కాగా జూలై రెండవ వారం నుంచి వర్షాలు కురుస్తుండటంతో వరి నారులు పెరిగిన రైతులు నాట్లను ప్రారంభించారు. సాగు పనుల్లో రైతన్నలు బిజీబిజీ అయ్యారు. మండలంలో మొత్తం 10 వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమైయ్యారు.

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్



సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: జిల్లా అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి సీతక్క నాలుగు వందల కోట్ల ప్రత్యేక బడ్జెట్ మంజూరు చేయడం గర్వించదగ్గ విషయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మోడల్ బస్టాండ్, అంతర్గత రోడ్లు, ప్రతి మండలంలో సంక్షేమ భవనాల కోసం నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. చందు, ఆయూబ్, గుండ్ల దేవేందర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఏకలవ్యుడి జయంతి



ఎకలవ్యుడి జయంతి వేడుకల్లో నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో సింగరేణి ఏరియా ఆస్పత్రి సమీపంలో తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా కమిటీ నాయకుడు కేంసారం రాజు ఆధ్వర్యంలో ఎరుకల కులదైవం ఏకలవ్యుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎకలవ్యుడి చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా కమిటీ నాయకులు దుగ్యాల స్వామి, కేతిరి సారయ్య, రాజయ్య, రాజకుమార్, తిరుపతి పాల్గొన్నారు.

‘చర్య తీసుకోవాలి’

కాటారం: మండలంలోని రేగులగూడెంలో బాలోజీ, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్య తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కోటగిరి పాపన్న, పొట్ట పోశయ్య డిమాండ్ చేశారు. బాలోజీ, కుటుంబ సభ్యులను బుధవారం వారు పరామర్శించి దాడి సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాలోజీ రేగులగూడెం శివారులోని సర్వే నెంబర్ 176/4/3/1 భూమిలో రేకులషెడ్డు వేసుకొని నివాసం ఉంటుండగా అర్ధరాత్రి ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు వచ్చి షెడ్డును కూల్చి వేసి తీవ్రంగా గాయపర్చినట్లు ఆరోపించారు. బాధితుడు సదరు దాడి చేసిన వ్యక్తుల్లో కొందరిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసులు విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు శంకర్, వినోద్, రామన్న, సతీశ్, లచ్చన్న, వెంకటేశ్వర్లు, సంపత్ ఉన్నారు.

కొండాయి-ఊరట్టం రోడ్డు నిర్మాణం



కొనసాగుతున్న రోడ్డు పనులు

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి జంపన్నవాగు వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను నిలిపివేశారని, ప్రజల అవసరాలను తీర్చేందుకు మంత్రి సీతక్క రూ.6 లక్షల నిధులతో కొండాయి నుంచి ఊరట్టం వెళ్లే రోడ్డు మార్గం మరమ్మతు చేపడుతున్నట్లు కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్ తెలిపారు. బుధవారం ఆయన రోడ్డు పనులను పరిశీలించి మట్లాడారు. కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డు చదును పనులు, కొండ్రేడు వద్ద కల్వర్టుల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మంత్రి తగిన చర్యలు తీసుకున్నారన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

వెంకటాపురం(కె): రక్తదానం ప్రాణదానంతో సమానం అని మాజీ వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్ అన్నారు. మండల పరిధిలోని పెరిక బజారులో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పెరిక బజారుకు చెందిన 20 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిడెం సాయి తేజా, చిడెం సాయి ప్రకాశ్, గుండమల్ల మధు, పల్నాటి ప్రవీణ్, రాచకొండ రాము, కొప్పుల వినోద్ ఉన్నారు.

శాంతినగర్‌లో పాఠశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మల్లేశ్

చిట్యాల: మండలంలోని కై లాపూర్ గ్రామ పంచాయతీ శివారు శాంతినగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్, వీకేసీ పార్టీ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ అంబాల అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం శాంతినగర్ గ్రామంలోని నిరుపేద కుటుంబాల విద్యార్థుల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలో నిరుపేద కుటుంబాల పిల్లలు చదువుకోవాలంటే సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిట్యాల, టేకుమట్ల మండల కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి నూతన భవనాన్ని ఏర్పాటు చేసి పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని కోరారు. అలాగే గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేక పోవడంతో అద్దె భవనంలో ఉంటున్నారని తక్షణమే నూతన భవనాన్ని మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చెరిపెల్లి విజయ్, పర్లపెల్లి శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నివాళి



మృతదేహంపై పూలమాల వేస్తున్న నాయకులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారం సమీపంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆళ్ల కుంట రమేశ్ (45) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం మృతుడి అంత్యక్రియాలకు వివిధ పార్టీల నాయకులు హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, నాయకులు నివాళులర్పించారు. మండల గౌరవ అధ్యక్షుడు అనంత రెడ్డి, మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరీల వెంకన్న, సీనియర్ నాయకులు జంగా వెంట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్ మాంకిడి నరసింహస్వామి, సింగిల్ విండో డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి



సురేష్(ఫైల్)

భూపాలపల్లి రూరల్: అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి (ఎస్ఎం) గ్రామంలో బుధవారం చోటు చేసుకొంది. గ్రామస్తులు మృతుడి బంధువుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన యువకుడు పోడేటి వెంకటేష్(28) కొన్ని రోజులుగా లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. కొద్ది కాలంగా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం తీసుకున్న ఫలితం లేదు. కాగా ఇంటి వద్దనే మృతి చెందినట్లు వారు తెలిపారు. యువకుడి మృతిపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోక సముద్రంలో కన్నీంటి పర్యంతం అయ్యారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



గోవిందరావుపేట: శివుడికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

గోవిందరావుపేట: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలను వేద పండితులు మిత్లేష్ శర్మ, సాయి తేజల ఆధ్వర్యంలో నిర్వహించారు. గోవిందరాజుల స్వామి ఆలయంలోని గోవిందరాజుల స్వామికి, శివయ్యకు, అమ్మవార్లకు, హనుమాన్ స్వామికి, సాయిబాబకు, హరిహర క్షేత్రం శ్రీ అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వామికి, వెంకటేశ్వరస్వామికి, దక్షిణముఖ ఆంజనేయ స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మల్హర్: తొలి ఏకాదశి వేడుకలను మండలంలోని తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల తదితర గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తాడిచర్ల వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఆషాడ మాసంలో వచ్చే మొదటి పండగా, అని, దీనిని శయన ఏకాదశిగా కూడా పిలుస్తుంటారు.

కాటారం: మండల కేంద్రంతో పాటు ఒడిపిలవంచ, బొప్పారం ఆలయాల్లో భక్తులు తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు స్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఉపవాసాలు ఉన్నారు. దామెరకుంట, అన్నారం బ్యారేజీల వద్ద భక్తుల సందడి నెలకొంది. మండలంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు అక్కడకు చేరుకొని గోదావరి పుణ్య స్నానాలు ఆచరించారు.

పొంగిపొర్లుతున్న వాగులు



ఉధృతంగా ప్రవహిస్తున్న కొంగాల వాగు

వాజేడు: మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులన్ని పొంగి ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని కొంగాల వాగు, గుండ్ల వాగు, మర్రిమాగు వాగు, అలుగొర్రె, బొమ్మనపల్లి వాగు, చీకుపల్లి వాగు, ఇసుక వాగు, ముస్టి వాగు, సాకలి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

వంతెన గడ్డర్లపై నడవద్దు



వంతెన వద్ద పోలీసులు

టేకుమట్ల: టేకుమట్ల-రాఘవరెడ్డిపేట చలివాగు వంతెన పునఃనిర్మాణంలో ఉందని ప్రజలు గడ్డర్లపై నడవొద్దని ఏఎస్సై అమరేందర్‌రెడ్డి అన్నారు. చలివాగు వంతెన గత సంవత్సరం వరద ఉధృతికి కూలిపోయింది. దీంతో ప్రస్తుతం పునఃనిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కాగా, ప్రయాణికులు రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించగా ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయింది. దాంతో కొంత మంది ప్రయాణికులు చలివాగుల వరద నుంచి దాటుతుండగా, మరి కొంత మంది మాత్రం వంతెన నిర్మాణంలోని గడ్డర్లపై నుంచి దాటుతున్నారు. గడ్డర్‌లపై వంతెన దాటడం అత్యంత ప్రమాదకరం కావున ఎస్సై గోగికారి ప్రసాద్ ఆదేశాల మేరకు వంతెన ఎవరూ దాటకుండా ఏఎస్సై బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంతెన పునఃనిర్మాణంలో ఉంది కావున ఎవరైనా గడ్డర్‌లపై నుంచి నడుస్తూ ప్రమాదవశాత్తు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున సాహసాలు చేయకుండా సురక్షిత ప్రయాణాన్ని చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు వంతెన వద్ద కాపలా కాస్తున్నారని, హెచ్చరికలను పట్టించుకోకుండా గడర్‌లపై నడిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది మొగిళి, రెవెన్యూ అధికారులు గందం సురేష్, అశోక్, వంతెన నిర్మాణ సిబ్బంది ఉన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



కాళేశ్వరంలో పీరీలను ఊరేగింపు చేస్తున్న భక్తులు



మహాముత్తారం: నర్సింగాపూర్‌లో..

కాటారం: త్యాగానికి ప్రతీక మొహర్రం అని పలువురు పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. వారం రోజులుగా గ్రామాల్లో పీరీల ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పలువురు పీరీలకు మొక్కులు చెల్లించుకున్నారు. మొహర్రంను పురస్కరించుకొని ముస్లీంలు, హిందువులు కలిసి పీరీల నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మొహర్రం పండుగ సందర్భంగా పీరీలను బుధవారం ఊరేగింపు చేసి గోదావరిలో నిమజ్జనం చేశారు. పీరీలను ముజావర్ సయ్యద్ వాజీద్ ఆధ్వర్యంలో గ్రామంలో ఊరేగించారు. డప్పుచప్పుళ్లతో పీరీలతో ఆటపాటలు ఆడారు. ముస్లింలతో పాటు హిందువులు ప్రత్యేకంగా బెల్లంతో షర్బత్, మలీద ముద్దలు, పాయసాలు చేసి భక్తులు పంపిణీ చేశారు. పీరీలకు దట్టీలు, కుడులు కట్టి భక్తులు మొక్కులు చెల్లించారు. తరువాత ఆనావాయితీ ప్రకారం త్రివేణి సంగమ గోదావరిలో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులకు రొట్టెల ప్రసాదం వితరణ చేశారు. కుల పెద్దలు, భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్యాగాలకు ప్రతీకగా నిలిచిన పీరీల ముందు పలువురు భక్తులు డప్పు చప్పుల్ల మధ్యన వేశాధారణలతో నృత్యాలు చేశారు. బుధవారం చివరి రోజున సాయత్రం గ్రామాల్లో పీరీలతో ఊరేగింపు చేశారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు.

మహాముత్తారం: మొహర్రం వేడుకలను మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో నిర్వహించారు. పీరీల ఉత్సవాలు చివరి రోజు కావడంతో ఊరేగింపు అనంతరం గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు తొలగింపు



చెట్టును తొలగిస్తున్న స్థానికులు, పోలీసులు

ఏటూరునాగారం: ఏటూరునాగారం భూర్గంపాడ్ ప్రధానరోడ్డు జీడి వాగు వద్ద భారీ వృక్షం వర్షాలకు నేలకూలింది. దీంతో ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై తాజొద్దీన్ సిబ్బందితో కలిసి స్థానిక ప్రజల సహకారంతో రోడ్డుపై పడిన చెట్టును తొలగించారు.